వ్యాఖ్యానములు

1937 SEPT

కాంగ్రెస్సు, ఆంధ్రజాతిపాలిటి తోకచుక్క

ఆదిలో క్రిమినల్ లాయరు.

ప్రతికక్షినీ, ప్రతికక్షిసాక్షులనూ బోల్తాకొట్టించడానికీ, మాజిస్ట్రేటుకి ముఖప్రీతి చెయ్యడానికీ నోరు తెరిపి లేకుండా మాట్లాడ్డమే అప్పటి పని.

తరవాత కాంగ్రెస్సు ప్రచారకులు.

సభ్యులను చేర్చడానికీ, చందాలూ విరాళాలూ వసూలుచెయ్యడానికీ, వుద్రేకం పొంది సంసారాలు విడిచి స్త్రీలుకూడా వుద్యమంలో వురకేటట్టూ విచ్చలవిడిగా మాట్లాడ్డమే అప్పటి పనీనీ.

సరే, యిప్పుడు అసెంబ్లీస్పీకరు.

ఇక చెప్పడాని కేం వుందీ? మాట్లాడ్డం వొక్కటే యీవుద్యోగంలో చెయ్యవలసిన పని.

అసలే వొళ్లు తెలవని ఆవేశం, దానికి సాయం యిన్నిరకాల పట్టాలు. ఇక బులుసు సాంబమూర్తిగారి వాగ్ధాటీకి అడ్డేమిటీ?

ఏమహోద్యోగాన పడ్డ లయినారో అది మొదలు, వొక్క క్షణమేనా, వారు తమ వుద్యోగధర్మం మఱచిపోవడం లేదు.

పదిమంది వొకచోట కూడితే చాలు, ఇక, త్యాగంమీద, ఆనందంమీద, గోదావరిమీద, గోదావరిలో యీదడంమీద, హిందీమీద, సైన్యంమీద, మిలిటరీలో చేరడానికి తమకి గల అర్హతమీద, ఆంధ్రభాషమీద, మితవ్యయంమీద—వారి మాటలకు అందని విషయం కనపడ్డం లేదు. వారి జిహ్వాగ్రంమీద నటించని మాట కనపడ్డం లేదు.

ఆంధ్రవిద్యార్థులు నిజమైన స్థితి తెలుసుకుని ఆవేదన పొంది, తమలాగ గుజరాతీలకూ హిందూస్థానీలకూ దాస్యం చెయ్యక, జాతీయవాదుల ప్రోద్బలంవల్ల ఆంధ్రరాష్ట్రాందోళనలో పడి చెడిపోతారేమో అని యెన్నాళ్లనుంచి కంగారుపడుతున్నారో పాపం, వారు, చివరికి (౧౭—౮—౩౭) ప్రెసిడెన్సీ కాలేజీ ఆంధ్రవిద్యార్థుల యెదట ఆంధ్రరాష్ట్రంమీద కూడా మాట్లాడారు.

ఆంధ్రరాష్ట్రం తప్పకుండా యేర్పడవలసిందే ట; కాని బ్రిటిషు పాలనలో వున్నన్నాళ్లూ ఆంధ్రరాష్ట్రం వస్తే మనకి లాభం లేదు ట. పైగా ఖర్చులు ఎక్కువ తగుల్తాయిట. సంపూర్ణస్వరాజ్యం వచ్చాక మనం ఆంధ్రరాష్ట్రంకోసం పనిచెయ్యాలి ట. అప్పుడు కాని దానివల్ల మనం బాగుపడము ట. కనక మన మిప్పుడు ప్రత్యేకరాష్ట్రంకోసం అలజడి చెయ్యకూడదు ట.

ఎంత చక్కని హేతువాదమూ! ఎంత నిశితమైన ఆర్థికసూత్ర పరిజ్ఞానమూ!

ఖర్చా?

సాంబమూర్తిగారా ఖర్చును గురించి మాట్లాడడం!

అయితే, ఎన్నో లక్షల రూపాయలు ఖర్చుపెడితే గాని తుంగభద్రాప్రాజెక్టు నిర్మించడం సాధ్యపడదు కనక అది కట్టిపెట్టెయ్యవలసిందేనా?

తొందరగడ్డసీమ కూడా ఖర్చుకే కారణం కాబట్టి అదిన్నీ విడిచిపెట్టెయ్యవలసిం దేనా?

ఋణాలు తీరి రైతులు బాగుపడేటట్టు చెయ్యా లంటే అమితంగా డబ్బు ఖర్చుపెట్టాలి. కనక ఆపనికూడా కట్టిపెట్టెయ్యవలసిం దేనా?

మాంచెస్టరుబట్టలకు కంటేనే కాదు, దేశీయమిల్లుబట్టలకు కంటే కూడా కద్దరుబట్టలకు ఖర్చెక్కువ కనక, మహాత్ములవారు, సంపూర్ణస్వరాజ్యం వచ్చేదాకా కద్దరుప్రచారమూ కద్దరుధారణమూ మానేస్తారా?

ఇరవయ్యో శతాబ్దంలో కూడా సకలవిధాలా హీనస్థితిలో వున్న ఆంధ్రజాతి, ప్రత్యేకరాష్ట్రం యేర్పడితే గాని వికసించ దనే విషయం తెలుసుకోడానికి తగిన పరిస్థితులు సాంబమూర్తిగారి కేమేనా వున్నాయా?

సంపూర్ణస్వాతంత్ర్యం మాట అలా వుండనిచ్చి, కనీసం అధినివేశస్వాతంత్ర్యం అయినా రాకుండా, కాంగ్రెస్సు, ఆంధ్రమండలాలను ప్రత్యేకపరిచి ఒక రాష్ట్రంగా యెందుకు పరిగణించిందో సాంబమూర్తిగారి కేమయినా బోధపడిందా?

పోనీ, ఖర్చు లేకుండా నిర్వహించతగ్గ గొప్ప పని యేమిటో సాంబమూర్తిగారు చూపించగలరా?

రౌండుటేబిలు కాన్ఫరెన్సులో ఆంధ్రరాష్ట్ర ప్రస్తావన చేసిన బొబ్బిలిరాజాగారికి, ప్రధానమంత్రిపదవి దఖలుపడగానే ఆంధ్రరాష్ట్రం అనవసరం అని తోచింది.

ఆంధ్రరాష్ట్రనిర్మాణం విషయంలో తగిన పని చెయ్యడానికి ప్రజల సొమ్ముతో లండను వెళ్లిన రెడ్డినాయుడుగారికి, లా మెంబరుషిప్పు సంక్రమించడంతోటే ఆంధ్రరాష్ట్రనిర్మాణం అపాయకరంగా కనపడింది.

మొన్నటిదాకా ఆంధ్రరాష్ట్రం కావా లని పెద్ద కబుర్లు చెప్పిన—ఇప్పటికిన్నీ తెలిసో తెలవకో ఆంధ్రరాష్ట్రం అవసరమే అని చెబుతూ వున్న సాంబమూర్తిగారికి, రాజగోపాలాచారిగారి నిర్హేతుకజాయమానకరుణాకటాక్షంవల్ల, అసెంబ్లీస్పీకరుపదవి లభించడంతోటే ఆంధ్రరాష్ట్రనిర్మాణంవల్ల కొంప గుల్ల అయిపోతుం దని దడ పట్టుకుంది.

ఈముగ్గురికీ తేడా యేమిటి?

జస్టిసుపార్టీ నాయకులకు కంటే పదవీవ్యామోహమూ, జోహుకుం ప్రవృత్తీ యీకాంగ్రెసునాయకునకే యెక్కువ అనడానికి అభ్యంతరం యేమిటీ?

ఇంత అసందర్భంగా మాట్లాడినందుకు, దేశంలో ఖండనలు ప్రబలా కేనా సాంబమూర్తిగారు తమతప్పు తెలుసుకుని, అంగీకరించి పశ్చాత్తాపపడవలసింది; కాని వారు, తమ ఉపన్యాసాన్ని సరిగా నివేదించలే దని పత్రికలమీద నేరం మోపుతున్నారు.

గాంధిగారి రిపోర్టులోకి వెళ్లాలనీ, జవహర్‌లాల్ గారికి ఆనందం కలిగించా లనీ, పటేలుగారి కటాక్షం తప్పిపోకుండా చూచుకోవా లనీ ఆవేశంలో పడి, ముందు తమ ధోరణి యెలా వెడుతోందో తెలుసుకోకుండా మాట్లాడి, తరవాత పత్రికలను నెపపెట్టడం కాంగ్రెస్సాంధ్రులకు బాగా అలవాటయిపోయింది.

సాంబమూర్తిగారు కూడా యీసందర్భంలో యిలా చేశా రని చెప్పడానికే అవకాశా లున్నాయి.

కాకపోయినా, యిప్పుడు వారు చేసిన సవరణలో మాత్రం అర్థం యేమి వున్నదీ ?

"నూతనరాష్ట్రముల నిర్మించుటవలన ఖర్చు యెక్కువగునను అభిప్రాయము వ్యాపించియుండె నని చెప్పితిని; కాని అది నాఅభిప్రాయము కాదు" అని వారు సవరించుకున్నారు.

అయితే ఖర్చు విషయంలో వారి అభిప్రాయం యేమిటి? అవ్యాపించిన అభిప్రాయం సరియైనది కా దని చెప్పకపోతే వారున్నూ దాన్ని బలపరిచినట్టే కాదూ ?

"రాష్ట్రీయశాసనసభలలోనే కాక ఫెడరల్ శాసనసభలోకూడా అంగీకరించబడితే కాని కొత్త రాష్ట్రం నిర్మించడానికి కొత్త యిండియా శాసనంలో అవకాశం లేదు కనకనూ, కాంగ్రెస్సువారు ఫెడరేషను ఏర్పడనివ్వరు కనకనూ పూర్ణస్వరాజ్యం వస్తే కాని ఆంధ్రరాష్ట్రం ఏర్పడడానికి వీలు లేద" ని తాము చెప్పినట్టు వారు సవరించుకున్నారు. కాంగ్రెస్సువారు ఫెడరేషన్ యేర్పడనివ్వక పోవడం యెంతవరకూ సాధ్యమో, యీకొత్తశాసనాన్ని ధ్వంసం చేసి సంపూర్ణస్వరాజ్యం సాధించడం యెంతవరకూ సత్యమో తరవాత చూసుకుందాం. అయితే, సాంబమూర్తిగారు యీకొత్తశాసనం అమల్లోకి రాకపూర్వమే ఆంధ్రరాష్ట్రం కోసం యెందుకు పని చేశారు కారూ ?

తాము స్వయంగా రౌండుటేబులుసభకి వెళ్లకపోతే పోయింది, కస్తూరి నరసింహారావుగారూ, దేశపాండ్యా సుబ్బారావుగారూ తరవాత యిందుకోసమే లండను వెళ్లినపుడు వారికి సంపూర్ణసహాయ సానుభూతు లెందుకు చూపించారు కారూ ?

ఓఢ్రులు ఆంధ్రభూభాగం విరుచుకుపోతూ వుంటే ఎందు కడ్డుకున్నారు కారూ ?

పోనీ, యీపనిమీదనే లండను వెళ్లిన అయ్యగారి సుబ్బారావుగారికీ, గిడుగు సీతాపతిపంతులుగారికీ మద్దత్తయినా యెందుకు చేశారు కారూ ?

అసలు సైమన్‌కమిషను యీదేశం వచ్చినప్పుడు యెందుకు పూరుకున్నారూ ?

బాధ్యత అంతా మీద పెట్టుకుని, ౧౯౧౭ లో కాకినాడలో నాలుగో ఆంధ్రమహాసభ జరిపించినప్పటినుంచీ, ఆంధ్రరాష్ట్రం కావా లని తాము బల్లగుద్దుతూనే వున్నారు కదా, యిప్పుడు కాంగ్రెస్సుఉద్యమంలో చూపిస్తూ వున్నంత ఆవేదనా, శ్రద్ధా అప్పుడు ఆంధ్రోద్యమంలో యెందుకు చూపించారు కాదూ ?

మాట్లాడా లంటే పదస్థులైనవారి కన్ని అవకాశాలే. అయితే: వారి మాటలు యుక్తియుక్తాలై వుండాలి, వాటిలో వూతం వుండాలి.

అసలు, పదస్థులైనవారికి, ఏమి మాట్లాడితే ఏమి వెలితి వచ్చి పోతుందో అని కసింత అయినా వెనకచూపు వుండాలి.

ఎటు చూసినా సాంబమూర్తిగారు చెప్పిందీ, చేసిందీ ఆంధ్రజాతీయతకి విరుద్ధంగానే — ప్రతిబంధకంగానే — వినాశకరంగానే వున్నాయి. ఇది అంతా కాంగ్రెస్సు సిద్ధాంతాలకు బలికావడంవల్ల వచ్చిన ఆపత్తు.

ఇప్పటి కయినా మా ఆంధ్రసోదరులు నిజం తెలుసుకోవడం చాలా అవసరం.

ఏమి టంటే ?

ఆంధ్రజాతికి శత్రువు జస్టిస్సు కాదు, కాంగ్రెస్సు.

కాంగ్రెస్సు, ఆంధ్రోద్యమాన్ని అణచివేసింది.

కాంగ్రెస్సు, ఆంధ్రరాష్ట్రనిర్మాణాన్ని పడగొట్టేసింది.

కాంగ్రెస్సు, ఆంధ్రభాషను చంపెయ్యడానికి పూనుకుంది.

కాంగ్రెస్సు, ఆంధ్రులను దాసానుదాసులను చేసింది.

కాంగ్రెస్సు, ఆంధ్రజాతీయవికాసానికి తోకచుక్క అయి కూచుంది.

గాంధిగారు ఆంధ్రోన్నతి చూడలేరు

అది మన ప్రకాశంగారి కోసం నిర్దిష్టమైన పదవి.

రాష్ట్రం అంతా గాలించినా దానికి తగినవారు వారొక్కరే. అర్హతకీ, ధర్మానికీ, సత్యానికీ, అహింసకీ కాంగ్రెస్సులో చోటే వుంటే, తప్పకుండా, అది వారికే వశపడి వుండేది.

కాని, గాంధిగారు, ప్రయత్నపూర్వకంగా దాన్ని తమ వియ్యంకుడి పరం చేశారు.

కాంగ్రెస్సాంధ్రుల భావదాస్యాని కిది శాశ్వతమైన స్మృతి చిహ్నం.

నిజానికి, రాజగోపాలాచారిగారు, మద్రాసు అసెంబ్లీకే కాదు, ఏఅసెంబ్లీకి — రేపు ఫెడరల్ అసెంబ్లీ యేర్పడితే దానికూడా దూరంగా వుండవలసినవారు.

ఎందు చేత నంటే ?

కాంగ్రెస్సువారి శాసనసభాప్రవేశానికి వారెప్పుడూ సుముఖులుగా వుండలేదు. వెనక, శాసనసభలలో ప్రవేశించడం కోసం

స్వరాజ్యపక్షం లేవనెత్తిన దాసుగారినీ, నెహ్రూగారినీ పట్టికొట్టించాలని, వారు, తీవ్రంగా ప్రయత్నించినవారు. శాసనసభాప్రవేశ విషయం మళ్లీ చర్చకి తెచ్చినప్పుడు, మొన్న మొన్న, అన్సారీభూలాభాయి ప్రభృతులను కూడా "నువ్వా నేనా?" అని కచ్చితంగా యెదిరించినవారు వారు. చివరికి, శాసనసభా ప్రవేశానికి, గాంధిగారు కూడా మెత్తపడ్డారు; కనక సరిపోయింది కాని లేకపోతే, ఆసందర్భంలో, కాంగ్రెస్సునే బహిష్కరించవలసినవారు వారు.

అలాంటి వీరవైష్ణవులు కనక, వారు, మద్రాసు అసెంబ్లీయెన్నికల్లో పోటీ చేస్తారనీ, యిలాగ ప్రధానమంత్రి అవుతారనీ యెప్పుడూ యెవరూ అనుకోలేదు. ఈశ్వరనిర్ణయాని క్కూడా యిది పూర్తిగా ప్రతికూలం అనే చెప్పవచ్చు.

ఇదిలా వుండగా:

యీ భైరూపాయలు ధరావత్తు కట్టి, అచార్యులుగారు, మద్రాసు అసెంబ్లీకి తమర్ని కాంగ్రెస్సు అభ్యర్థిగా నిలపవలసిం దని పార్లమెంటరీబోర్డుకి దరఖాస్తు పెట్టుకోలేదు. అనరరీగా అయినా, బోర్డువారు, ఆచార్యులుగారిని అభ్యర్థులుగా చేర్చుకోలేదు. సమావేశాలమీద సమావేశాలు జరిపి, చర్చలమీద చర్చలు చేసి, తుడుపుల తరవాత తుడుపులు పెట్టి, హంసపాదులపైని హంసపాదు లుంచి బోర్డువారు ప్రకటించిన ఫైనల్ లీస్టులో అయినా ఆచార్యులుగారి వూరూ పేరూ లేదు.

కాని, తమ వియ్యంకుడుగారి పాదాల దగ్గిర కూచుని, వుపనిషద్రహస్యాలు తెలుసుకుంటూ, భగవద్గీత అయిపోయింది; కనక బ్రహ్మసూత్రాలకు మహాభాష్యం వ్రాయిస్తూ మోక్షమార్గం పెతుక్కోవలసిన రాజగోపాలాచారిగారు కన్నుమూసి తెరిచేటప్పటికి యోగభ్రష్టులు లాగ ప్రధానమంత్రి అయిపోయారు.

ఏమంటే?

కాంగ్రెస్సాంధ్రుడు, తన రాష్ట్రంలో అసెంబ్లీ కాంగ్రెసుపక్షనాయకుడు కావడమూ, ప్రధానమంత్రి కావడమూ పవిత్రమైన కాంగ్రెస్సుయొక్క సిద్ధాంతాలకూ, పరమావధికీ, కార్యక్రమానికీ, గాంధిగారి ప్రతిష్ఠకీ, దర్జాకీ, హోదాకీ—ముఖ్యంగా వారి దృఢవ్రతానికీ భంగకరాలు. కాంగ్రెస్సు వలయంలో ఆంధ్రుడికి భుక్తపడవలసింది భృత్యపదవి వొక్కటి మాత్రమే. ఆంధ్రుడికంతకంటే లేశమూ యోగ్యత లేదు. ఉండినా వుందని వొప్పుకోడానికి కాంగ్రెస్సు "అంతరాత్మ" వొప్పుకోదు.

ఏవిషయంలో అయినా, గాంధిగారు, తమ నిశ్చయాన్ని సడలించుకుంటారు; గాని ఆంధ్రుల విషయంలో చాలా నిక్కచ్చిగా వుంటారు.

ఆదిలో, కాంగ్రెస్సు, మంత్రిపదవులు స్వీకరించవలసివస్తుం దని వారనుకోలేదు. అంచేతనే వారు మొదట రాజగోపాలాచారిగారిని మద్రాసు అసెంబ్లీకి నిలపలేదు.

కాని, మంత్రిపదవుల విషయం లోపాయికారీగా తేలిన తరవాత వారు తమ పొరపాటు తెలుసుకున్నారు.

త్యాగాన్ని పట్టి చూసినా, ధైర్యసాహసాలను పట్టి చూసినా, ప్రతిభను పట్టి చూసినా, అనుభవాన్ని పట్టి చూసినా, దీక్షను పట్టి చూసినా, అన్నిటికీ ప్రధానం, యెటువంటి పరిస్థితులలోనూ యెలాంటి ప్రలోభనాలకూ చలించని శీలాన్ని పట్టిచూసినా మద్రాసు అసెంబ్లీకి నిలపబడ్డవారిలో ప్రకాశంగారిని మించగలిగినవారు వారికి కనపడలేదు.

రాజగోపాలాచారిగారు కూడా ప్రకాశంగారి యెదట తీసికట్టు అని వారికి తెలుసు; కాని అచారిగారు తమ వియ్యంకులు. ఈకారణంవల్ల, వారు, పరీక్షల కన్నిటికీ అతీతులు. తాముపూనుకుంటే వారిని గురించి యెవరూ కిక్కురుమనరు. ఆంధ్రనాయకుణ్ణి కూలగొట్టాలంటే యింతకంటే వారికి వుపాయం తోచలేదు.

ఇక చెప్పవలసిం దేం వుందీ?

గాంధిగారు ఆంధ్రజాతికి ఎంత ద్రోహం చెయ్యగలరో అంతా చేశారు. ఏమీ తరవాయి అట్టేపెట్టలేదు.

కాని ఇంత కుంభకోణం జరిగినా కాంగ్రెస్సాంధ్రులు మాట్లాడలేదు. చివరికి ప్రకాశంగారికి మంత్రివర్గంలో చోటు దొరకడమే అమ్మక్క అయిపోయింది.

ప్రకాశంగారయినా అపదవి తిరస్కరించివుండవలసినది. అథవా, యీకుట్ర అంతా బయలుపెట్టి అయినా వుండవలసింది. కాని భావదాస్యం వారిని అదిమిపెట్టేసింది.

భారతీయుడికి రావలసిన పదవి అంగ్లేయుడికి యిస్తే యీప్రకాశంగారూ, వారికి యిలాంటిది జరిగినందుకు చంకలు గుద్దుకుని పరమాన్నం చేసుకుని తినిన ఆంధ్రులూ గవర్నమెంటుని అనేకవిధాల నిందించి వుందురు.

నాయకత్వం విషయంలోనూ, ప్రధానమంత్రిత్వం విషయంలోనూ బొంబాయిలో కూడా యిలాంటి కుంభకోణమే జరిగింది; కాని అక్కడ యింతకంటే శిలవైశిత్యం వున్నది. వెంటనే అల్లరి రేగింది. బలవంతంగా—బుద్ధిపూర్వంగా—వంచనోద్వృత్తితో ఆపదవులకు దూరంచెయ్యబడ్డ నారిమనుగారు కుట్రలను బయటపెట్టారు.

అక్కడ యిప్పుడు సత్రయాగం జరుగుతోంది.

ఏదీ, కాంగ్రెస్సాంధ్రులలో అలాంటి గుండెనిబ్బరం కనపడ దేం?

గాంధిగారి హయాములో, కాంగ్రెస్సు, మన జాతిని ఎన్నివిధాల అవమానిస్తూ వుండినా యీ కాంగ్రెస్సాంధ్రులు కిక్కురుమన రేం?

కాంగ్రెస్సు శిక్షణ వొక్క అంధ్రులకోసమే పుట్టిందా?

అర్హత లన్నీ—అవకాశం అంతా యిలాగ ధ్వంసం చేసిన గాంధిగారు, తమ వియ్యంకుల ప్రభుత్వంలో అంధ్రదేశాని కేమయినా మేలు కలగనిస్తారా?

నాట్యకళాపరిషత్తు పరీక్షకు నిలుస్తుందా ?

నాటకం రాయడానికి పనికిరారని, ౩౬ గురు ఆంధ్రకవుల మొగాల మీద, నాట్యకళాపరిషత్తు, నల్లజీడితో ముద్రకొట్టి విడిచిపెట్టింది.

చైతన్యం వున్న జాతి అయితే ఈ మూలనుంచి ఆ మూలకి దేశంలో రణగోల పుట్టించవలసిన విషయం యిది.

కాని, పరాభూతులైన గ్రంథకర్తలలో యే వొకరిద్దరో తప్ప తతిమ్మా అందరూ నిమ్మకు నీరుపోసినట్టు వూరుకుని వున్నారు.

సిగ్గుసిగ్గు!

అయితే,

ఇది యిలాగే జరుగుతుందని మొదట్నుంచీ మేము చెబుతూనే వున్నాము.

ఎంచేతనంటే?

కవిత్వం అనుభవించతగ్గది గాని పరీక్షకి అందేది కాదు.

అందులోనూ నాటకం అనేది రసికుల వేత్తృత్వానికి నికషం కాని, వారి తర్కానికి లోబడేది కాదు.

పైగా,

పరిషన్నిర్వాహకులకు—పట్టుపట్టి నాటకపరీక్షావిషయం ప్రతిపాదించి అమల్లో పెట్టించగలిగినవారికి కవిత్వం అంటే యేమిటో నాటకం అంటే యేమిటో యెంతమాత్రమూ తెలవదు.

రెండు మూడు సమావేశాలలో ప్రదర్శించబడ్డ నాటకాలను పట్టి చూస్తే, వారిలో చాలామంది, నాట్యకళకు సంబంధించిన సంస్థలలో సభ్యులుగా వుండడానికి కూడా అర్హులు కారు.

పరీక్షకు సిద్ధపడిన కవులున్నూ నాటకకర్త పదవి యెలాంటిదో సుతారామూ గుర్తించలేదు.

పరీక్షకులు కూడా యిందులో చాలా చిక్కులున్నాయని గ్రహించగలిగినవారు కారు.

కాగా,

పరిషత్తువారు తాహతుమాలిన పరుగులకు పూనుకున్నారు.

కవులు ద్రవ్యాశకు లోబడిపోయారు.

పరీక్షకులు సర్వజ్ఞత్వం ఆరోపించుకున్నారు.

ఫలితం ?

ఆంధ్రకవులలో నాటకం రాయతగ్గ మొనగాడు లేడని పెద్ద మచ్చ.

ఇది అనుచితమైన పని.

జాతి మొత్తంమీద యిలాంటి అపవాదు పుట్టడానికి తగిన ఆలోచనలు చెయ్యడం గర్హించతగ్గ సంగతి.

నిజంగానే, ఆంధ్రులలో నాటకరచనకు అర్హులైన వారు లేకపోతే, లజ్జావహం అయినా, అది వేరే విషయం.

కాని,

స్వశక్తిపరిజ్ఞాత అయిన కవి యెవ్వడూ పరీక్షకు కూచోడు.

భావం బోధపరుచుకుని, రసం గ్రహించి ఆనందించగల పండితుడెవడూ కవితాపరీక్షకు సిద్ధపడడు.

సభ్యతను ఆసించేవారెవరూ యిలాంటి యేర్పాటులు చెయ్యలేరు.

పరిషన్నిర్వాహకులకు, ఆదిలోనే మేము, నోబుల్ బహుమాన పద్ధతి అనుసరించతగ్గదని సూచించాము.

అది, పరీక్షకులకు నచ్చిన నాటకానికి బహుమతీ యిస్తూ, తదితరాలకు ఎలాంటి దుష్కీర్తీ కలక్కుండా చేసే విధానం అని కూడా విశదపరిచాము.

కాని, వారికది నచ్చలేదు.

"వెయ్యిన్నూటపదహార్లు ఇచ్చేటప్పుడు మేమెందుకు పోటీలు పెట్టకూడదూ ?" అని మాత్రమే వారహంభావం వహించినట్టు కనపడుతుంది.

అవును మరి.

ఒకొక్క విషయం తమ జీవితపరమావధిగా నిర్ణయించుకుని పనిచేసేవారు త్రికరణాయా పూనుకుంటే తప్ప దేనికేనా పర్యవసానం యిలాగే వుంటుంది.

అయితే అయింది కాని.

పరిషత్తువారు, ఉత్తమనాటకానికి తామివ్వదలుచుకున్న వెయ్యిన్నూటపదహార్లూ, అప్పటికి కాదిప్పటికేనా సిద్ధపరుచుకుని వున్నట్టు లెక్కలు చూపించగలరా ?

ఈపర్యవసానం యింత హృదయశోషకంగా వుండడానికీ, యిది యిన్నాళ్లదాకా తేలకపోవడానికీ, ద్రవ్యాభావమూ, ద్రవ్యం సమకూడే వుపాయం తట్టకపోవడమూ కారణాలు కావని రుజువుపరుచుకోగలరా ?

"విడతీసి పాలించు"

విడతీసి పాలించడం బ్రిటిషువారి నీతి అంటారు కాంగ్రెసువారు. ఆనీతిలో కాంగ్రెస్సునియంతలు అంతకంటే నిపుణులంటాము మేము.

మద్రాసు అసెంబ్లీకి సుమారు ఇరవైమంది సభ్యులను పంపిన ఖండం అది. భూతత్వాన్ని పట్టీ, వాతావరణాన్ని పట్టీ, ముఖ్యంగా ఆంధ్రజాతియొక్క దౌర్భాగ్యాన్ని పట్టీ, అది, అగాధసముద్రంలోని వొక దిక్కుమాలిన దీవిగా వ్యవహరించబడుతోంది.

అయినా,

అక్కణ్ణుంచి వెళ్లిన అసెంబ్లీ సభ్యులలో "నువ్వా నేనా ?" అనగల విద్యాధికులున్నారు. జెయిళ్లకు వెళ్లినవారున్నారు. స్వార్థం అంటే యేమిటో యెరగనివారున్నారు. త్యాగం చెయ్యడం అంటే శరీరం పొంగిపోయేవారున్నారు. అనుభవం కలవారున్నారు. సమర్థులున్నారు. అర్హులున్నారు.

అధికారం కూడా వారికి కావలసినంత వుంది. ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ చూపించవలసిన సన్నివేశాలక్కడ యెన్నో వున్నాయి.

కాని మంత్రివర్గంలో పది పదవు లుండినా వొక్కటీ ఆరాయలసీమవారికి దఖలుపడలేదు. అధ్యక్షపదవులు నాలు గుండినా, కార్యదర్శిపదవులు పది వుండినా వారికి లాభం లేకపోయింది.

ఏం ?

అది రాజగోపాలాచారిగారి భేదతంత్ర చాతుర్యం.

తమ ప్రభుత్వంలో అరవదేశాని కెక్కువ సౌకర్యాలు కలగా లంటే ఆంధ్రుల ప్రతిఘటన వుండకూడదు ?

ఆంధ్రుల ప్రతిఘటన లేకుండా చెయ్యా లంటే రాయలసీమనీ, సర్కార్లను విడదియ్యాలి.

ఇది ఫలప్రద మైన వుపాయం. ఆంధ్రవిశ్వకళాపరిషద్వ్యవహారం సందర్భంలో సత్యమూర్తిగారు యీ భేదతంత్రానికి పునాదివేసి వుంచారు. రాజగోపాలాచారిగారు దృఢ మైన ఆపునాదిమీద దుర్భేద్య మైన వుక్కుదుర్గం నిర్మించారు.

బెసికిపోలేదు. ఎత్తు పూర్తిగా ఫలించింది.

పరాభవించబడడంవల్ల విభ్రాంతచిత్తులై వున్న రాయలసీమవారు, చాళుక్యసీమ (సర్కారుల) వారిమీద కోపాలూ మిరియాలూ నూరుతున్నారు.

నిజానికి, మేము, మాసీమవారు నిర్దోషు లని అనము. అనలేము. రాయలసీమ అంటే మాసీమవారికి మంచి అభిప్రాయం లేదు. లక్ష్యం లేదు. అసలు రాయలసీమ అంటే సరియైన జ్ఞానం లేదు. వారిని న్యూనతపరిస్తే అది తమకే ఆత్మహత్య అనే యింగితం లేదు.

కాని అరవదేశం కంటే ఆంధ్రదేశం చిన్నదా ? అరవదేశపు రాబడికంటే ఆంధ్రదేశపు రాబడి తక్కువదా ? అరవల సంఖ్యకంటే ఆంధ్రుల సంఖ్య లోచ్చా ? అరవల ప్రతిభముందు ఆంధ్రుల ప్రతిభ తీసికట్టా ? పోనీ, తల తీసి తల అతికగల లౌక్యశిఖామణులు మాలో కొంచెమే వున్నారా ?

మరి గాంధిగారి వియ్యంకులు, ఆరు మంత్రిపదవులు తమ అరవలకు మినహాయించుకుని తమకి మూడే యిస్తే మాసీమవారు ప్రతిఘటించలేకపోయా రేం ? తమకే రావలసిన ప్రధానమంత్రిపదవిని, గాంధిగారు, అన్యాక్రాంతం చేస్తే వల్లకాదని అడ్డుకోలేకపోయా రేం ?

రాయలసీమకోసం పట్టుబడితే తమ పని యెక్కడ వుక్కిక్కి అయిపోతుందో అని మాసీమవారు చల్లచల్లగా వూరుకున్నా రంటే కాదనడానికి మాకు ఆధారాలు లేవు. అయితే, తమకి జరిగిన అన్యాయం వుద్ఘాటిస్తూ రాయలసీమ వోటర్లే కాని రాయలసీమ అభ్యర్థు లెవరూ మాట్లాడ రేం ?

పోనీ, తమకు కొన్ని పదవులు రావా లని మాసీమవారు పట్టు పట్టినట్టే, తమకున్నూ కొన్ని పదవులు కావా లని రాయలసీమవారు కూడా భల్లూకప్పట్టు పట్టలేకపోయా రేం ? ఇప్పుడు మాసీమవారిమీద చూపిస్తూ వున్న నిరసనం ఆయినా ప్రధానమంత్రిగారి రాజనీతిమీద చూపించలేకపోతున్నా రేం ?

ఉన్న దల్లా యేమి టంటే ?

మనలో మనకి ఐకమత్యం లేదు. భారతదేశం యావత్తూ బాగుపడా లంటే —స్వతంత్రం కావా లంటే భారతీయుల మైన మనకి ఐకమత్యం అత్యవసరం అని గ్రహించగలిగిన మనం పృథగ్జాతులమూ కూడా, ఆంధ్రజాతి యావత్తూ బాగుపడా లంటే—తక్కిన జాతులకు తీసిపోకుండా వుండా లంటే ఆంధ్రుల మైన మనకి ఐకమత్యం అత్యవసరం అని గమనించలేకపోతున్నాము.

రాజగోపాలాచారిగారు ఈసూత్రం బాగా తెలుసుకున్నారు. భేదతంత్రం ప్రయోగించారు. దానికి ఫలితంగా మనలో మనం కుమ్ములాడుకుంటున్నాము.

•నంద్యాలలో తాము నిర్వహించిన ఆంధ్రరాష్ట్రీయసభను తెరవడానికి యెగిరెగిరిపడుతూ రాజగోపాలాచార్యులుగారిని పిలిచిన రాయలసీమవారు ఇప్పటి కేనా సత్యం గ్రహించడం అవసరం.

నిజంగా రాయలసీమవారు, తమకి ప్రత్యేకరాష్ట్రీయకాంగ్రెస్సు సంఘం కావా లని పట్టుపడితే, మన ప్రధానమంత్రిగారు ఆకోరికను వెంటనే సఫలం చేయిస్తారు. ఏమంటే ? అది, వారి భేదతంత్రానికి గొప్ప ఫలితమే.

రోటిలో తల దూర్చి రోకటిపోటుకి జంకితే ?

కాంగ్రెస్సు మంత్రులను ఎవరూ విమర్శించకూడదు ట. వా రేం చేసినా వూరుకుని—పైగా—వారికి ప్రోత్సాహం కలిగించాలిట.

నెహ్రూపటేలుగార్ల ఆజ్ఞ లివి.

నిజంగా, స్వశక్తివల్లనే కాంగ్రెస్సు అధ్యక్షు లయి వుంటే, వీరు, ఇంకా యెలాంటి ఆజ్ఞలు జారీచేసి వుందురో ?

ఆత్మగౌరవం యెరిగినవా రంతరూ—కలిగినవారందరూ యీ ఆజ్ఞలను విసిరి కొడతా రనే మేము నమ్ముతున్నాము.

కాంగ్రెస్సుమంత్రులు ఆకాశాన్నుంచి వూడిపడలేదు. వారు తప్పులు చెయ్యకపోరు. ఇప్పటికే బోలెడు చేసి వున్నారు. ఇంకా చేస్తారు. అసలు, వారు చేసే వాటిలో తప్పులే యెక్కువ వుంటాయి. ఉండి తీరతాయి.

తప్పులు చెయ్యడంలో, తక్కిన అయిదుగురు కాంగ్రెస్సు ప్రధానమంత్రులకూ గాంధిగారి వియ్యంకులు అగ్రేసరులై కూడా వుంటారు. ఉన్నారు.

వాటిని యెత్తి చూపించడమూ, విమర్శించడమూ, కాంగ్రెస్సు పత్రికలకే తప్పకుండా వున్నది.

ఇంతకీ : లిబరల్ పక్షం యెలాంటిదో, పీపిల్సుపక్షం యెలాంటిదో, జస్టిస్సుపక్షం యెలాంటిదో, ప్రజలకు కాంగ్రెస్సుపక్షమున్నూ అలాంటిదే.

దాని ప్రత్యేకత యేమీ లేదు.

జస్టిస్సుపక్షంవారిలో ప్రతిభావంతులూ, సమర్థులూ దేశభక్తులూ, దేశసేవకులూ తక్కువగా లేరు. కాని వారికి పరిణతి చాలింది

కాదు. అతిపరిమితాలే అయినా, చేతిలో వున్న అధికారాలను కూడా, వారు, సరిగా వినియోగించుకోలేదు. అంచేతనే పదహారు సంవత్సరాల అధికారాంతమందు, వారు, ప్రజలు ఏవగించుకునే స్థితికి వచ్చారు. మన రాష్ట్రంలో, కాంగ్రెస్సుకి మెజారిటీ రావడానికి కారణం యిదే. ప్రధానకారణం యిదే.

పెట్టుబడిదారు లే తెగలలో వున్నారో, వ్యవసాయదారు లే తెగలలో వున్నారో, పారిశ్రామికు లే తెగలలో వున్నారో, కార్మికు లే తెగలలో వున్నారో ఆతెగలలోనుంచే యేర్పడ్డ జస్టిస్సుపక్షం వారు, స్వతంత్రు లయి వుండినీన్నీ, కంకణం కట్టుకుని వుండినీన్నీ ఆతెగల కేనా సౌకర్యాలు కలిగించలేకపోయారు. ఇబ్బందులున్నూ తీర్చలేకపోయారు.

మన కాంగ్రెస్సుపక్షంవారికి అలాంటి ప్రాతినిధ్యం చాలినంత లేదు. ఆతెగలవారి కష్టసుఖాలు కాంగ్రెస్సువారికి బోధపడాలంటే మాటల్లోది కాదు. వాటికోసం కమిటీలు నియమించేదాకా వచ్చింది కాంగ్రెస్సుపని.

దొరతనంవారి పోలసీలో వుండే దోషాలనూ, లోటుపాట్లనూ తెలుసుకుని, విమర్శించగలరే కాని, కాంగ్రెస్సువారు, వ్యవసాయదారులు మొదలైనవారి అవసరాలు తెలుసుకుని, తన్నివారణోపాయాలు చెప్పలేరు. పైగా, గుజరాతీలూ, హిందూస్థానీలూ అనుజ్ఞ యిస్తే గాని యిక్కడి కాంగ్రెస్సువా రేమీ చెయ్యలేరు. వీరు పూర్తిగా అస్వతంత్రులు.

రాజగోపాలాచారిగారి మంత్రాంగం, పూర్తిగా దీన్నే ధృవపరుస్తూ వున్నది.

ప్రజల కష్టసుఖాలు స్వయంగా గుర్తించీ, ఈరాష్ట్రీయపరిస్థితులు గుజరాతీలయొక్కా, హిందూస్థానీలయొక్కా పరిజ్ఞానానికిభిన్నంగావుండవచ్చు నని గమనించీ, ముఖ్యంగా భావదాస్యానికి లోనుగాకుండా, కాంగ్రెస్సువారు మంచి పనులు చేస్తే సంతోషమే కాని వారు చేసే పను లేమిటో, వాటికి ప్రేరకాలైన పరిస్థితు లెలాంటివో విమర్శించకుండా వుండడం యెలాగా? వారు చెడ్డ పనులు చేస్తే నిరసించకుండా వుండడం యెలాగా?

విమర్శించవద్దనడంలో ఔదార్యం యేమి వున్నదీ? ఔచిత్యం యేమి వున్నదీ? గుణగ్రహణపరాయణత యేమి వున్నదీ; పరిజ్ఞానం మాత్రం యెక్కడ వున్నదీ?

పోనీ, యితర్లను వీరు విమర్శించకుండా వున్నారా?

ఈ శ్రీరంగనీతు లన్నీ అప్పు డేమయిపోయాయీ?

అధికారదుర్వినియోగం

“కద్దరు కట్టండి. కాంగ్రెస్సులో చేరండి. త్రివర్ణపతాకను గౌరవించండి” ఇదీ నేటి కాంగ్రెస్సుమంత్రుల ప్రచారం.

ఒక రాష్ట్రీయప్రధానమంత్రి గవర్నమెంటు శక్రటరీకి కద్దరు తాను బహుమతీ చేశాడు. మరొక రాష్ట్రీయప్రధానమంత్రి గవర్నరు భార్యకు కద్దరుబట్టలు సమర్పించాడు. ఇదేం పని అని యింకొక రాష్ట్రీయప్రధానమంత్రి గవర్నరుకే కద్దరుబట్టలు కట్టబెట్టాడు.

గాంధిగారి వియ్యంకులు కద్దరు కట్టవలసిం దని ఆఫీసర్ల కందరకీ తాఖీదులు పంపుతున్నారు. దీనిమీద, కాంగ్రెస్సుపత్రికలు, హిందూదేశచరిత్రలో నవీనమహాయుగం ప్రారంభం అయినట్టు సారస్యం తీశాయి.

చిత్రంగానే వున్నది. ఈకాంగ్రెస్సుమంత్రులు, కద్దరును బతికించడానికి, మళ్లీ వొకమాటు చివరి ప్రయత్నం చేస్తారుకామోసు.

అయితే కద్దరుప్రచారం చెయ్యడాని కేనా కాంగ్రెస్సువారు శాసనసభలో ప్రవేశించారు? కద్దరు కట్టవలసిం దనీ, కాంగ్రెస్సులో చేరవలసిం దనీ ప్రజలను నిర్బంధించడాని కేనా ఆరు రాష్ట్రాలలో కాంగ్రెస్సువారు మంత్రిపదవులు స్వీకరించారు? నగరీయసంఘాల భవనాల మీదనూ, స్థానికసంస్థల కార్యస్థానాల మీదనూ త్రివర్ణపతాకలను ప్రతిష్ఠించడాని కేనా కాంగ్రెస్సు మంత్రులు పర్యటనం చేస్తున్నారు? “అధికారం చెలాయించి మీ పక్షం బాగా బలపరుచుకోండి” అనా, వోటర్లు, కాంగ్రెస్సువారికి, ఆరు రాష్ట్రాల శాసనసభలలో మెజారిటీ కలిగించారు?

ఇది పూర్తిగా అధికారదుర్వినియోగం. నిక్కచ్చిగా గర్హించతగ్గది.

ప్రపంచానికంతటికీ వొకప్పుడు కద్దరే గతిగా వుండినది. ఇవాళ అది చారిత్రికవస్తువు. దాని ప్రదర్శనం పూర్తి అయిపోయింది. ఇక దాన్ని నేలమాళిగలో భద్రపరచవచ్చు. కాంగ్రెస్సుకే చెందిన సోషలిష్టులు ఈమాటే అంటున్నారు.

కద్దరువల్ల దేశానికి గాని, జాతికి గాని యేమీ పుష్టి కలగలేదు. ఇక ముందున్నూ కలగబోదు. కద్దరు కట్టడంవల్ల స్వరాజ్యం రాలేదు. రాదు. కద్దరుకీ స్వరాజ్యానికీ కార్యకారణసంబంధం యేమీ లేదు. ఆధారాధేయభావం కూడా సుతరామూ లేదు. కద్దరులో ప్రతిభోన్మేషం యేమీ లేదు. భావస్వాతంత్ర్యమున్నూ లేదు. కద్దరులో అసలు జీవమే లేదు. కద్దరు గాంధీగారికి సాలగ్రామం కంటే పవిత్రమైనదిగా కనపడవచ్చు. వారి భక్తుల కది ఆదినారాయణమూర్తికంటేనూ పైమెట్టుగా తోచవచ్చు. అలాగే, మరి కొందరి కది గడ్డిపరక కంటే నికృష్టమైనదిగా యెందుకు కనపడకూడదూ? కద్దరు కడితే గాంధిగారిమీద అంధభక్తి వున్నట్టు రుజువు అవుతుంది. అంతే.

కాంగ్రెస్సుమంత్రులు యేవిధంగా అయినా బాధపెడతారేమో అనీ, వారివల్ల కొన్ని ప్రయోజనాలు సాధించుకోడానికీ, యిలాంటివే మరికొన్ని యితరకారణాలవల్లనూ యిదివరకు ముట్టి అయినా యెరగనివా రిప్పుడు కొందరు కొత్తగా కద్దరు కట్టవచ్చు. ఈవిధంగా కద్దరు ధారుల సంఖ్య పెరిగి గాంధిగారికి ఆనందపారవశ్యం కలగనూ వచ్చు. కాని, కాంగ్రెస్సు ప్రభుత్వం అంతరించిందంటే కొత్తవారే కాక పాతవారు కూడా కద్దరుకి బలాదూరు

చెబుతారు. ఇది యెంతత్వరగా సంభవిస్తే దేశం అంత త్వరగా బాగుపడుతుంది.

కాంగ్రెస్సును గురించిన్నీ మూలం లేని వ్యాఖ్యలు ముదిరాయి. అది భారతీయు లైన హిందూమహమ్మదీయాదుల కందరికీ మాతృసంస్థ. జాతీయసంస్థ కూడాను. దీన్ని బట్టి కాంగ్రెస్సువారి బూకరింపు యెంత వరకూ వెళ్లిందో గ్రహించవచ్చు. అసలు, యిప్పుడు, మాతృసంస్థ అనీ, జాతీయసంస్థ అనీ చెప్పతగ్గ సంస్థ యేదీ యీ దేశంలో లేనేలేదు. ఇక కాంగ్రెస్సు అలాంటిది కాదని వేరే చెప్పడం యెందుకూ ?

అయితే ఒకప్పు డది మన కందరికీ మాతృసంస్థగా వుండినది. అప్పటి నాయకులు వ్యక్త్యభిరుచులతో దాన్ని కలుషితం చెయ్యక జాతియొక్క తాహతునూ, పరిస్థితులనూ బాగా గమనిస్తూ జాగ్రత్తగా నడుపుతూ వచ్చారు. రాజకీయాలలో అభిరుచికలవారి కందఱికీ అప్పుడది అందుబాటులో వుండేది. ఆకర్షిస్తూనూ వుండేది. చేరదీస్తూనూ వుండేది. కాని, దేశదౌర్భాగ్యంవల్ల తిలకుగోక్లేగార్లకు భావాలు భేదించాయి. ఇప్పట్లో హిందూదేశంలో అంకురించ కూడని రాజకీయపక్షాలకు అప్పుడే అంకురార్పణ అయినది. దాంతో కాంగ్రెస్సు పవని కలుషితం అయింది. తిలకుగారు కొన్నాళ్లూ, గోక్లేగారు కొన్నాళ్లూ దాన్ని యేలారు. వారి యేల్బడిలో వీరూ, వీరి యేల్బడిలో వారూ దాన్ని బహిష్కరిస్తూ వచ్చారు. లక్నో కాంగ్రెస్సులో ఉభయపక్షాలవారూ వొక మాటు యేకవేదికమీద చేరగలిగారు; గాని అది తాత్కాలికమే అయిపోయింది.

ఇంతలో, మహానుభావులు గాంధిగారు వచ్చారు. గాంధిగారి హయాములో అది మూలమూలలకూ వ్యాపించిం దంటే కాదనము. కాని, అది పూర్తిగా పాక్షికసంస్థ అయిపోయినది. అది మాతృత్వాన్ని కోల్పోయింది. జాతీయతకు దూరం అయిపోయింది. నిర్మాణకార్యక్రమదీక్షితులు కనక, గాంధిగారు, టంచెన్‌గా వొకచోట నుంచోబెట్టి, సిమెంటుకాంక్రీటుతో దాని చుట్టూ ఆకాశం యెత్తున అభేద్య మైన ప్రాకారం నిర్మించారు.

దాని ద్వారం తెరిచే వుంది కాదా అంటే అవు ననే అంటాము. కాని యేమి లాభమూ ? భావదాసులు కానివారూ, ఆత్మగౌరవం కలవారూ ఆద్వారం దగ్గిరికి అయినా వెళ్లలేరు. ఎం చేత నంటే ?

ఇవాళ యెవ రేనా కాంగ్రెస్సులో చేరా లంటే, మొట్టమొదట కద్దరు కట్టాలి. గుజరాతీటోపీ నెత్తిమీద పెట్టుకోవాలి. తమ తమ మాతృభాషలను చంపుకుని హిందీని స్వీకరించాలి. రాటపు జెండాకు మొక్కాలి. ఇవీ, యిలాంటివీ పాక్షికసంస్థలకే గాని మాతృసంస్థలకూ, జాతీయసంస్థలకూ నియమాలుగా వుండవచ్చునా ?

బ్రిటిషువారికి పార్లమెంటున్నది. వారిలో అనేక రాజకీయపక్షా లున్నవి. కాని, ఆపార్లమెంటు, ఆ పక్షాల కట్టుబాట్లకు అతీతంగా వున్నది. తాను, సొంతానికి, ఏరాజకీయపక్షానికి చెందినా, గ్రేటు బ్రిటనులో పుట్టి, మైనారిటీ వెళ్లిన ప్రతివ్యక్తీ పార్లమెంటులో ప్రవేశించవచ్చు. తన పార్టీకి మెజార్టీ తెచ్చుకో గలిగితే ఆపార్లమెంటుని గుప్పిట్లో పెట్టుకుని రవి అస్తమించని విశాలసామ్రాజ్యం యేలవచ్చు. అలాంటివారు అక్కడ అలా యేలుతూనే వున్నారు.

ఏదీ, కాంగ్రెస్సుకి అలాంటి యోగ్యత యెక్కడా ?

నగరీయసంఘాలకూ, స్థానికసంస్థలకూ, శాసనసభలకూ సంబంధించిన ఎన్నికలలో, జస్టిస్సుపక్షంతోనూ, పీపిల్సుపక్షంతోనూ, లిబరల్ పక్షంతోనూ, స్వతంత్రులతోనూ, యితరరాష్ట్రాలలో మరికొన్ని పక్షాలతోనూ పోటీపడి, జబ్బచరిచి నిలిచి, తన ప్రత్యేకతను చాటించుకుంటూ, ధృవపరుచుకుంటూ, తన పరిమితప్రాతినిధ్యాన్ని స్వయంగానే ప్రకటించుకుంటూ వున్న కాంగ్రెస్సు, దేశీయుల కందరికీ మాతృసంస్థ—లేక జాతీయసంస్థ అనే మాటలో అర్థం యేమిటీ ? ఔచిత్యం యేదీ ? సౌజన్యమున్నా యెక్కడా ?

త్రివర్ణపతాకవిషయం యింతకంటే అధ్వాన్నంగా వుంది. దానికిన్నీ, కాంగ్రెసువారు జాతీయపతాక అని పేరు పెడుతున్నారు. కాని కాంగ్రెస్సే పాక్షికసంస్థ అయిపోయినప్పుడు ఆకాంగ్రెస్సువారి పతాకకు జాతీయత యెక్కణ్ణుంచి వస్తుంది ? పట్టాభిగారి వివరణ చూశాము. వారు త్రివర్ణపతాక చరిత్ర చక్కగా చెప్పారు. అంతే. దానివల్ల అపతాకకు జాతీయత యేర్పడదు. అది కాంగ్రెస్సు పతాక మాత్రమే. కాంగ్రెస్సొక్కటే దేశం కాదు. జాతిన్నీ కాదు. ఎంతమాత్రమూ కాదు. కావడానికి వీలున్నూ లేదు.

జాతీయపతాకకు ఎన్ని రంగు లుండాలీ ? ఏరంగు ఎక్కడ వుండాలీ ? అనేది చిన్న విషయం. కాని రాటం చిహ్నంగా వుండడం అవివేకం. ఇవాళ, రాటం, హిందూదేశ చరిత్రకీ, సభ్యతకీ, నాగరికతకీ, సంప్రదాయానికీ, విజ్ఞానానికీ మాయని మచ్చ. అది పోవాలి. ఎగిరిపోవాలి.

ఇంతకీ : జాతీయపతాక మనకి యేర్పడా లంటే, సమానప్రాతినిధ్యంతో అన్ని పక్షాలవారూ కలిసి ఆలోచించి నిర్ణయించాలి. రాజకీయపక్షాలకు అవతల వున్నవారే మనలో యెక్కువ. కనక వారిలో వేత్తలు కూడా ఆ ఆలోచనలో పాల్గొనాలి. అక్కడ నిశ్చయం కావాలి. ఆప్రకారం తయారు కావాలి. అది మాత్రమే జాతీయపతాక అవుతుంది. దాన్ని మాత్రమే అందరూ శిరసా వహించాలి. శిరసావహిస్తారు. ఇప్పటి కాంగ్రెస్సుపతాకతో దేశం మొత్తాని కేమీ సంబంధం లేదు. జాతి మొత్తంమీద ఏమీ పూచీలేదు.

ఇలాగ, కాంగ్రెస్సుమంత్రులు, కద్దరు కట్టమనీ, కాంగ్రెస్సులో చేర మనీ, త్రివర్ణపతాకను గౌరవించ మనీ ప్రజలకు నొక్కి చెప్పడం కాంగ్రెస్సుప్రచారం అవుతుంది.

అమాయికు లైన ప్రజలూ, ఆప్రజల కంటే ముందు ఇతరపక్షాలవారూ యీవిషయంలో మంత్రులను తీవ్రంగా—దృఢంగా—నిక్కచ్చిగా ప్రతిఘటించవలసి వున్నది.

తీపికల్లు—గాంధిగారు—కృష్ణాపత్రిక

"తీపికల్లు పుష్టికర మని నమ్మువారు దానిని నిరభ్యంతరముగ త్రాగవచ్చు" నంటున్నది (౨౮–౮–౩౭) కృష్ణాపత్రిక.

వస్తుగుణం తెలసినవా రనేకు లున్నారు. ప్రసక్తి వచ్చినప్పుడు, వారు, ఫలానా వస్తువు చాలా మంచి దంటారు. అయితే: ఇక వారు దానిని వాడి తీరవలసిన దేనా? లేక, అలా చెప్పేవారు దానిని వాడేవారే అయివుంటా రని నిశ్చయం చేసెయ్యవలసిన దేనా?

మొగలాయీ పాదుపాల ప్రవృత్తిని మించిపోతున్న దిది.

తీపికల్లు పుష్టికరం అని యెవరో చెప్పారో, రాశారో సూటిగా అది కృష్ణాపత్రిక చెవినో, కంటనో పడినది. పిడుగుపడ్డట్టయి పోయింది; కాని గాంధిగారున్నూ అలాగే చెప్పారు. మాట్టాడ్డానికి వీలులేకపోయింది. అయితే, అక్కసు తీరలేదు. పైని చూపించిన మాట అనేసింది. అప్పటికి తృప్తి అయినది.

అనుకంపాజనక మైన అవస్థ యిది. మంచిచెడ్డలూ, సాధ్యాసాధ్యాలూ యేర్పరించుకునే శక్తిని చేతులారా చంపుకున్న వారికీ, విన్నన్ను చెప్పినదే వేద మని నమ్మే పరప్రత్యయనేయబుద్ధులకూ యిది సహజ మైన పరిణామం.

కాని, యిన్నాళ్లకి, గాంధిగారే తీపికల్లు అంటే యిష్టపడ్డప్పుడు, వారి అడుగుజాడలకోసం వెతుక్కునే కృష్ణాపత్రిక మాత్రం యిష్టపడక యేం చేస్తుందీ?

గాంధిగారు, చాలాకాలంనుంచే మద్యనిషేధాన్ని గురించి తీవ్రప్రచారం చేస్తున్నారు. ఆప్రచారం చేసేవారిలో, ప్రస్తుతం గాంధిగారికే ప్రాముఖ్యం యివ్వడానికి మా కేమీ ఆక్షేపణ లేదు కాని అది చూసినప్పు డల్లా "ఇలా చెయ్యడానికి వీరికి ప్రమాణం యేమిటీ? ఎందుకూ యీ వ్యర్థప్రయత్నాలూ?" అనిపిస్తూ వుంటుంది. నవ్వున్నూ వస్తుంది.

ఎంచేత నంటే?

ఎటుచూసినా, సృష్టి అంతా ద్వంద్వభూయిష్ఠంగా వున్నది. సవరణలు ప్రతిపాదించి, నెగ్గించి, అమల్లో పెట్టడం యెవరికీ సాధ్యం కాదు. అది అలా జరిగిపోవలసినదే. కొమ్ములు తిరిగినవారేనా దానికి దాసోహం అనవలసినదే.

వ్యభిచారం ప్రపంచం అంతటా వున్నది. వారు త్రికాలజ్ఞాన సంపన్నులే కావచ్చును; కొందరు, కలిసి ఆలోచించి, స్త్రీపురుషులకు వివాహబంధం యేర్పరిచారు. వెంటనే వ్యభిచారం పుట్టింది. వివాహబంధం యేర్పరచడంవల్లనే అది పుట్టింది. వివాహబంధంలో కట్టుబాట్లు యెక్కువ అయినకొద్దీ అది బిగిసిపోయింది. వివాహబంధం వున్నంతకాలమూ అది వుంటుంది. ఇది తాతాచార్యులుగారి ముద్ర; కాని అది మంచి దని యెప్పుడూ యెవరూ చెప్పలేదు. చెప్పరు. వ్యభిచరించేవారున్నూ అది చెడ్డ దనే అంగీకరిస్తారు. అయితే మానరు. మానలేరు. అలా అని దాన్నెవరూ ప్రోత్సహించరు. ప్రోత్సహించలేరు. అది తిట్లు తింటూనూ వుంటుంది. లక్షణంగా జరుగుతూనూ వుంటుంది.

మద్యపానం యిలాంటి దేనా కాదు. దాన్ని, కొందరు నిషేధించారు. నిజమే; కాని మరికొందరు అది మనుష్యులకు విధి అన్నారు.

మద్యపానం ప్రపంచం అంతటా వున్నది. కర్మభూమి అనిపించుకునే మన దేశంలోనూ యెక్కువగానే వున్నది.

మన పురాణేతిహాసాలు అడుగడుక్కీ పానవర్ణనలతో గుబాళిస్తున్నాయి.

మన ఆలంకారికులూ, కవులూ మద్యపానం పూర్తిగా అంగీకరించడమే కాదు, విధిగా వుండా లన్నారు.

అయితే: ఇదంతా వీరాసాలకు మరిగినవారి ప్రలాపం అనవచ్చు; కాని, మనుష్యు డైన ప్రతీవాడికీ మద్యపానం అగత్య మైన దని—చేసితీరవలసిం దని ఆయుర్వేదం దృఢంగా విధిస్తున్నది.

మదాత్యయం అని వొక వ్యాధి. అది మద్యపానం వల్ల పుడుతుంది. చిత్రం యేమి టంటే? ఆవ్యాధి నిదానం చెబుతూనూ, చికిత్స చెబుతూనూ కూడా, ఆయుర్వేదం, మద్యపానం మానవద్దంటుంది.

మాధవకరుడు, తన మాధవనిదానంలో,

"విషంలో వున్న గుణాలే మద్యంలోనూ వున్నవి. మద్యాన్ని అతిగా పుచ్చుకుంటే మదాత్యయం అనే ఉగ్రవ్యాధి కలుగుతుంది. ౧. ఇంకే మంటే? స్వభావంవల్ల అన్నం యేలాంటిదో మద్యం అలాంటిది. అన్నం యుక్తియుక్తంగా—అంటే మోతాదుగా భుజిస్తే అమృతం అవుతుంది. మోతాదు దాటితే రోగం పుట్టిస్తుంది. అలాగే మద్యమున్నూ ౨. ప్రాణికోటికి అన్నమే ప్రాణం. అతిమాత్రంగా సేవిస్తే ఆ అన్నం ప్రాణాలు తీస్తుంది. విషం ప్రాణాలు తీస్తుంది. నిజమే; కాని మోతాదుగా సేవిస్తే ఆవిషం రసాయనం అయి ఆయువూ, బలమూ వృద్ధిచేస్తుంది ౩." అని చెప్పాడు.

ఇలా చెప్పి అత నూరుకోలేదు.

"విధీ, మోతాదూ, కాలమూ అనుసరించి అన్నం భుజిస్తే యెలా బలం కలుగుతుందో, అలాగే, మద్యం కూడా, విధీ మోతాదూ కాలమూ అనుసరించి సేవిస్తే అమృతోపమానం అవుతుంది. ౪. స్నిగ్ధా లైన భక్ష్యమాంసాలతోనూ, నిర్దుష్టం అయిన అన్నంతోనూ మద్యపానం చేస్తే ఆయువూ, బలమూ, శరీరపుష్టీ కలుగుతాయి. ౫. మద్యం విధిప్రకారం పుచ్చుకుంటే శరీరసౌందర్యమూ, మనస్సంతోషమూ, తేజస్సూ, పరాక్రమమూ కలుగుతాయి. ౬."

ఇక్కడ "స్నిగ్ధా లైన భక్ష్యమాంసాలతోనూ, నిర్దుష్టం అయిన అన్నంతోనూ మద్యపానం చేస్తే" అంటే చాలా అర్థం వున్నది. ఆహారం పుచ్చుకోకుండా మద్యం పుచ్చుకోకూడదు. పుచ్చుకుంటే శరీరం కృశించి, రోగాలు పుడతాయి. కనక భోజనం గాని, ఉపాహారం గాని అయిన తరవాతనే మద్యపానం చెయ్యాలి. అలా

చేస్తే అవి సరిగా జీర్ణం అయి పైని చెప్పిన లాభాలు కలుగుతాయి. యూరపియనులు యీవిధిప్రకారమే మద్యపానం చేస్తారని తెలుస్తున్నది. వెనక, వొకమాటు, ఎవరో "తిన్న మాంసపుముద్దలు జీర్ణం కావడానికే ఆంగ్లేయులు మద్యపానం చేస్తా" రని చెప్పాడు. దీనికనుగుణంగానే "ఆనూపజాంగలమాంసాలు యథావిధిగానే వంటచెయ్యబడినా మద్యం సహాయం లేనిదే యెలాగ జీర్ణం అవుతాయీ ?" అని వాగ్భటుడు అడుగుతున్నాడు.

అయితే: మద్యపానం చేస్తే మత్తు కలుగుతుంది. ఎంతమాత్రమూ సందేహం లేదు ; కాని ఆమదానికి, మాధవకరుడు, నాలుగు దశలు చెప్పాడు. వాటికి ప్రథమమదం, ద్వితీయమదం, తృతీయమదం, చతుర్థమదం అని పేరు. ప్రథమమదలక్షణం ఏమిటంటే? "బుద్ధి వికసిస్తుంది. జ్ఞాపకశక్తి హెచ్చుతుంది. ప్రీతీ, సుఖమూ కలుగుతాయి. అన్నపాననిద్రలు ప్రీతిభాజనాలవుతాయి. చదివేటప్పుడూ, పాడేటప్పుడూ, స్వరానికి సారళ్యం కలుగుతుంది. అది (ప్రథమమదం) అతిరమ్యం అయినది."

రెండు, మూడు, నాలుగు మదాలు మంచివి కావు. చెరుపు చేస్తాయి. విధీ, మోతాదూ, కాలమూ గుర్తించి మద్యం సేవిస్తే ప్రథమమదం మాత్రమే కలుగుతుంది. అది కోరతగ్గదే. వెనక, వొకమాటు, మద్యపానానికి సంబంధించిన చర్చవచ్చినప్పుడు మద్రాసు కౌన్సిలులో యెక్జిక్యూటివు కౌన్సిలు మెంబరు (పేరు జ్ఞాపకం లేదు. యూరోపియను) మితపానం సౌఖ్యకరం అని చెప్పాడు. అది ఆయుర్వేదసిద్ధాంతానికి అనుగుణంగానే వున్నది *

అయితే: గాంధిగారు. మద్యాన్ని తీపికల్లనీ, పుల్లకల్లనీ విడదీస్తున్నారు. తీపికల్లు అంటేనే వారు ఇష్టపడుతున్నారు. పుల్లకల్లు నిషా కలిగిస్తుం దని దృఢంగా నిరసిస్తున్నారు.

కాని ఆయుర్వేదం చూస్తే యిది భ్రాంతిమూలంగా కనపడుతుంది. తీపీ, పులుపూ అని విభేదం చెయ్యకుండా మద్యపానాన్నే ఇంతవరకూ తాము పూర్తిగా నిషేధిస్తూ వుండినారు కనక, నిజం తెలిశాక మద్యనిషేధప్రచారం వదులుకుంటే బాగుండదు కనక, వారు ఈయెత్తు యెత్తా రనికూడా తోస్తున్నది.

ఏమంటే? "మద్యంలో మధురాది షడ్రసాలూ వున్నాయి ; కాని ఆమ్ల (పులుపు) రసం ప్రధానమైనది. అమ్లరసము కల వస్తువు లన్నిటికీ మద్యం మొదటిది" అని ఆయుర్వేదసిద్ధాంతం,

ఇంతకీ: "మద్రాసుప్రభుత్వమువారు ప్రస్తుతము ఒక సేలము జిల్లాలో మాత్రము మద్యవిక్రయనిషేధమునకు పూనుకొనినారు. మహాత్ముడు సూచించినటుల మూడు సంవత్సరములలో గాకపోయినను, అయిదు సంవత్సముల కైనను మద్యనిషేధమునకు రాష్ట్రివ్యాప్తి సిద్ధించితీరు" నంటున్నదే కృష్ణాపత్రిక ? "తీపికల్లు పుష్టికర మని నమ్ము వారు దానిని నిరభ్యంతరముగ త్రాగవచ్చు" నన్నే దానికీ దీనికీ సమన్వయం యెలాగా ?

తమ వియ్యంకుల నమ్మకా న్ననుసరించి, రాజగోపాలాచారిగారు, సేలంజిల్లాలో తీపికల్లును నిషేధించడం మానుతారా ? వారు, సేలంజిల్లాలో ప్రవేశపెట్టబోయే కార్యక్రమంలో యీవిభేదం చూపించారా ? గాంధిగారు తీపికల్లు విషయంలో చూపించే ఆనుకూల్యానికి అతివ్యాప్తి రాకుండా వుంటుం దని కృష్ణాపత్రిక నమ్ముతున్నదా ?

సాంబమూర్తిగారిని నెపపెట్టడాని కాకూడదూ ?

"ఆంధ్రరాష్ట్రము నేడు జరూరుగా కావలసియున్నది........ ప్రత్యేకాంధ్రరాష్ట్రము నేర్పాటు చేసేయెడల ఖర్చులు తగులుబడి యగు నని ఇన్నాళ్లకు ౧౯౩౭ సం. రంలో వాదించే యెడల ఆవాదమునకు మనము చెవి యొగ్గజాలము. ఈరాష్ట్రవిషయమై కాలయాపన చెయ్యక వీలైనంత త్వరలో శాసనసభ్యులు ఆలోచింపవలెను."

ఇది డాక్టరు పట్టాభిసీతారామయ్యగారి ప్రకటన.

ఆంధ్రరాష్ట్రం కావాలని పట్టాభిసీతారామయ్యగారికి, నిజంగా, యింత ఆవేదన వున్నదా ? ఉంటే యెప్పణ్ణుంచీ ?

ఆదికాలంలో, వారు, ఆంధ్రోద్యమంలో పని చెయ్యడమూ, ఆంధ్రరాష్ట్రం కావాలని తీవ్రప్రచారమే చెయ్యడమూ యెరుగుదుము ; కాని తరవాత, వారు కాంగ్రెస్సుముంపులో పడిపోయారు. అతిపిలో, వారికి, కాంగ్రెస్సు వ్యవహారం దగ్గిర ఆంధ్రోద్యమమూ, సంపూర్ణస్వరాజ్యం యెదట ఆంధ్రరాష్ట్రమూ చంటిపిల్లల వుబలాటంగానూ నికృష్టంగానూ, అవమానకరంగానూ కనపడ్డాయి.

అడుగు మోపడానికి కాంగ్రెస్సుగుడారంలో కసింత చోటు దొరికింది మొదలు ఇప్పటి దాకా వారి యీదృష్టి మారిం దనుకోడాని కెలాంటి సన్నివేశాలూ తటస్థించలేదు.

అలాంటివా రిప్పు డిలాంటి ప్రకటన చెయ్యడం —ఇది చూసి దేశంలో యెంతో మంది పొంగిపోతున్నారు. అయితే: సాంబమూర్తిగారు, ప్రెసిడెన్సీకాలేజీలో అర్థం లేని ఆవుపన్యాసం చేసి వుండకపోతే డాక్టరుగారీప్రకటన చేసి వుందురా ? ఇది సాంబమూర్తిగారిని నెపపెట్టడాని కాకూడదని రుజువుచెయ్యగలరా ?

కాకపోతేనే మేము చాలా సంతోషిస్తాము. అయితే ; డాక్టరుగారు అంతటితో పూరుకుంటే పనికిరాదు. వారు ఆంధ్రరాష్ట్రాన్ని గురించి ప్రజలలో ఆందోళన లేవనెత్తాలి. రాయలసీమ వ్యాప్తిని నిర్ణయించడం కాదు, ఆసీమవారిని కష్టసుఖాలు చెప్పి కూడగట్టుకురావాలి. ప్రభుత్వంతో, రాయబారాలు చేసి సాఫల్యం కలిగించాలి.

డాక్టరుగారి శక్తి యెవరూ ఎరుగనిది కాదు. ఇంతే కాదింతకంటే యెక్కువ పనులే వారు నిర్వహించగలరు.

అయితే: ఇందులో వొక చిక్కున్నది. అది డాక్టరుగారికి బాగా తెలుసు. ఏమిటంటే ! సంపూర్ణస్వరాజ్యోద్యమమూ, ఆంధ్రరాష్ట్రో

* మద్యపానాన్ని, చరకశుశ్రుతవాగ్భటాలు, ఇంతకంటే దృఢంగా విధిస్తున్నాయి. అది వచ్చే సంచికలో సాకల్యంగా ప్రకటిస్తాము.

సంపాదకుడు.

ద్యమమూ వొకదాని కొకటి చుక్కెదురు. ఈరెండూ యేక కాలంలో నడపడం సాధ్యం కాదు. సంపూర్ణస్వరాజ్యోద్యమం బ్రిటిషువారికి యెసరుపెడుతుంది. ఆంధ్రరాష్ట్రోద్యమం బ్రిటిషు వారిని మంచి చేసుకుంటేనే సఫలం అవుతుంది.

హోరుగారు మొదలయిన, దక్షులైన అధికారులనేకులు వారి వరలో చెప్పిన మాటలూ, రాయబారులకు కలిగించిన ఆశలూ యెరిగివున్న వారికి, బ్రిటిషువారు ఆంధ్రరాష్ట్రనిర్మాణం విషయంలో సుముఖులే అని తెలిసే వుంది; కాని కాంగ్రెసాంధ్రుల నిరాకరణవ్రతమే దానికి విఘాతం కలిగించినది. అధికారులతో కొంత సహకారం చెయ్యవలసివస్తుం దనే మన డాక్టరుగారూ, అలాంటివారూ ఆంధ్రరాష్ట్రోద్యమాన్ని చంపేశారు. అది చెయ్యడానికి గుజరాతీల అనుజ్ఞ లేకపోవడం వల్లనే, వోఢ్రులు, పన్నెండువేల చదరపు మైళ్ల తెనుగుగడ్డను విరుచుకుపోతూ వుంటేనూ, మూడులక్షల ఆంధ్రులను చెరపడుతూ వుంటేనూ చూస్తూ వూరుకున్నారు.

ఇది దాస్తే దాగేది కాదు.

ఇలాంటి పరిస్థితులలో, ఇన్నాళ్లకి, కాంగ్రెస్సువారి మంత్రిపదవీ స్వీకారనిశ్చయంవల్లనే అవకాశం యిచ్చిన, ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెస్సుసంఘానికి, అధ్యక్షత సంపాదించుకున్న డాక్టరుగారు, కాంగ్రెస్సునియంతల కన్నెర్రలు లెక్కచెయ్యక, ఆత్మోజ్జీవనకరమైన ఆంధ్రరాష్ట్రం జరూరుగా సాధించడానికి పూనుకోగలరా?

"ఈరాష్ట్రవిషయమై కాలయాపన చెయ్యక వీలైనంత త్వరలో శాసనసభ్యులు ఆలోచింపవలెను" అనే మాటకు, తాము మాత్రం దూరంగానే వుంటామనీ, శాసనసభ్యులున్నూ, ముఖ్యంగా సాంబమూర్తిగారున్నూ పనిచెయ్యవలసిందే అని అర్థం కాదూ? తెనుగు శాసనసభ్యులు, ఇప్పుడు, గాంధిగారి విధేయులకు చేతిలో ఒడిసిపిల్లకాయ లయిపోయివున్నారు; కనక సెలవు లేకపోతే వారుకూడా ఆంధ్రరాష్ట్రం మాట యెత్తుకోనక్కరలే దని ధ్వని కాదూ?

హిందీ ముప్పు తెచ్చిపెడుతుంది

గాంధిగారి విలయధోరణీ, కలేల్కర్ మున్షీ ప్రభృతుల అంధవిశ్వాసమూ, నెహ్రూ రాజేంద్రప్రసాదు టాండన్ మొదలయినవారి మాతృభాషాభిమానమూ కట్టకట్టుకుని మన దక్షిణదేశభాషలమీద విరుచుకుపడ్డాయి.

వెంకటప్పయ్యపంతులు, డాక్టరు పట్టాభి, ముటూ్నరి కృష్ణారావుగార్ల వంటి స్వప్నవిహారధీరులు దిగ్భ్రాంతులై ఆపిడుగుపాటుకి స్వాగతం నివేదించుకుంటున్నారు.

మన గోపాలరెడ్డి మంత్రిగారు హిందీప్రచారమే తమ పదవికి సాఫల్యహేతు వని భావించుకున్నారు.

ఆంధ్రయువకులలో కొందరు, మొదట మరో వృత్తి లేకా, తరవాత అనేకవిధాల రుచిమరిగీ దేశం అంతటా స్త్రీలకూ పురుషులకూ ఆవిషం పోస్తున్నారు.

ప్రస్తుతం ప్రధానమంత్రి రాజగోపాలాచార్యులుగారు తమ నవమంత్రపు అధికారాన్ని పురస్కరించుకుని, ౧, ౨, 3 ఫారాల విద్యార్థులకు అందరికీ ఆహిందీని నిర్బంధం చేస్తున్నారు.

మంత్రిపదవి కోసమే కాంగ్రెస్సులో చేరిన మన విద్యామంత్రి డాక్టరు సుబ్రాయన్ గారు అనేకకారణాలవల్ల దానికి తల వూపి తాఖీదులు పంపుతున్నారు.

ఇలాగ సభ్యవాఙ్మయం యేమీ లేని హిందీ మన పాఠశాలలను వధ్యశాలలుగా తయారుచెయ్యబోతోంది.

గాంధిగారు ఆజ్ఞాపించారు. ఇక చాలు. సహజమైన యుక్తాయుక్తపరిజ్ఞానయోగ్యతను చంపుకున్న కాంగ్రెస్సుముగ్ధులకు కావలసిం దంతే.

విద్యాసంస్థల బహిష్కారం వెర్రితలలు వేసింది. శాసనసభల బహిష్కారం చప్పబడిపోయింది. న్యాయస్థానాల బహిష్కారం నామావశిష్టం అయిపోయింది. హిందూమహమ్మదీయసఖ్యం బుసికిపోయింది. మదరాసు మొదలయిన చోట్ల కల్లంగడిదార్ల కష్టాలు నివారించడానికి గాంధిగారి విధేయులకులే రాయబారాలు వింటున్నారు. డిసెంబరు 3౧ చరిత్రలో యెక్కడా యోగ్యత లేకుండాపోయింది. హామీలు అయిపు లేకుండా పోయాయి.

పికెటింగు, ఉప్పుసత్యాగ్రహం, నిరశనవ్రతాలు—కాంగ్రెస్సుని స్వాధీనం చేసుకుని గాంధిగారు వేసిన యెత్తు లన్నీ టుప్పున యెగిరిపోతూనే వచ్చాయి.

అయినా గాంధిగారింకా యెత్తులు మానలేదు.

కాంగ్రెసుముగ్ధులకు ఇంకా తత్వం బోధపడలేదు.

హిందీద్వారా జాతీయత సాధించి తన్మూలంగా సంపూర్ణస్వరాజ్యం సంపాదించ బూనుకున్నారు గాంధిగారు.

కాంగ్రెసు ముగ్ధులు తుదిప్రయత్నంగా శాసనసభలు ఆక్రమించుకుని, బ్రిటిషుసింహంమీదికి ఆహిందీపరకని అభిమంత్రిస్తున్నారు.

ఈపట్టుదలను అపాయకర మని బాధ్యత యెరిగిన పత్రికలు నిరసించాయి. దేశాభ్యుదయం కోరే పెత్తలు తూలనాడారు.

కాని కాంగ్రెస్సుప్రభుత్వం మొండిపట్టు పట్టింది.

విధిలేక చెయ్యవలసివచ్చిన పని కనక మంత్రులు, నోరు మెదపకుండా చేసి వూరుకున్నా అదో అందంగా వుండును.

కాని ఉపన్యాసాలమీద వుపన్యాసాలు చేస్తున్నారు పాపం.

ఎంత సేపూ హిందీవల్ల మాతృభాషలకు అపాయం లే దనడం తప్ప వారు చెయ్యగల హేతువాదం యేమీ కనపడ్డం లేదు.

విద్యామంత్రి, ఇంగ్లండులో పిల్లలు, స్కూళ్లలో నాలుగుభాషలు నేర్చుకుంటూ రన్నారు. అయితే, విద్యాబోధ అంతా వారికి మాతృభాషలోనే జరుగుతుంది ట.

ఇక్కడ మాతృభాషలకు అలాంటి పదవి లేదని వారికి తెలుసు; కాని ఆ వుపమానం యిక్కడ అతకదని మాత్రం వారెరుగరు.

ఒకచోట వుపన్యసిస్తూ, గాంధిగారి విధేయులు "హిందీ నేర్చుకుంటే సంస్కృతం సులభంగా వస్తుం" దన్నారు.

ప్రపంచానికంతటికీ యిది సరికొత్త సంగతి. సంస్కృతం నేర్చుకుంటే మన దేశభాషలలో అనేకాలు సులభంగా స్వాధీనం అవుతాయని మాత్రమే యిప్పటిదాకా మన నమ్మకం. ఇది కాదన్న మొగాడు ఎక్కడా కనపడలేదు. ఉండడు కూడానూ.

అయితే, రాజగోపాలాచారిగారు ఈ ప్రపంచప్రవృత్తి కంతటికీ అతీతులు కదా? గాంధిగారు హిందీవల్ల సంపూర్ణస్వరాజ్యమే వూడిపడుతుం దని చెప్పాటప్పుడు, వారి విధేయులు, హిందీ వస్తే సంస్కృతం కొట్టిన పిండే అని చెప్పడంలో అనౌచిత్యం యేమి వున్నదీ?

ఇక మన సాంబమూర్తిగారు.

దక్షిణభారతహిందీప్రచారసభవారి యేర్పాటుతో (౨౮-౮-౩౮) గోఖలేహాలులో జరిగిన సభలో హిందీతరగతికి ప్రారంభం చేస్తూ, వారు, "బాలురు భాషలు నేర్చుకొనుటలో పెద్దవారి కన్న నేర్పరు" లని సెలవిచ్చారు. సాంబమూర్తిగారే కాదు, సుబ్రాయన్, రాజగోపాలాచార్యులుగార్లు కూడా భాషలు నేర్చుకోవాలంటే అందుకు బాల్యమే తగిన దని చాలామాట్లు చెప్పారు.

అయితే, పిల్లలు నేర్చుకోవలసింది అసంఖ్యభాష లేనా? వారిని, పెద్దలు పాఠశాలలకు పంపడం అందు కేనా?

మరిన్నీ, సాంబమూర్తిగారు "హిందీ నేర్చుటవలన మాతృభాషలకు మోసము కలుగునని భావింపరాదు.........చెన్న రాష్ట్రము భాషలను బట్టి స్వతంత్రరాష్ట్రములుగ విభజింపబడినగాని మాతృభాషలు అభివృద్ధి చెందనేరవు.........మూడవ ఫారము వరకు ఇంగ్లీషు నేర్పుట మాని, దానికి బదులు హిందీ నేర్పిన బాలురకు కష్ట ముండదు" అని చెప్పారు.

తమ వుపన్యాసంలో యెన్ని రకాల స్వవచనవ్యాఘాతాలున్నవో సాంబమూర్తికి తెలవలేదు. వారు గడగడ మాట్లాడేశారు. సరి. వారి పూచీ తీరిపోయింది.

అయితే, మాతృభాషలో ప్రవేశం లేనివారి మాటలు యుక్తాయుక్తాలయి వుండా లని మనం ఆశించడం అసందర్భమే.

పోనీ, మూడో ఫారం దాకా యింగ్లీషు నేర్పడం మాన్పించగలిగే టంతవరకూ ప్రధానమంత్రిగారి దుస్సాహసాన్ని ప్రతిఘటించి నిలుస్తారా సాంబమూర్తిగారు?

చెన్నరాష్ట్రం భాషాప్రయుక్తరాష్ట్రాలుగా విభజించబడేదాకా హిందీని అలహాబాదు ఆనందభవనం దాకా తరిమికొడతారా వారు?

ఇవన్నీ ఊసుపోక వుపన్యాసాలు.

గాంధిగారి ఆజ్ఞలో నిగూఢవేదాంతరహస్యం యేదో యిమిడి వున్నట్టూ, అది తమకి తూర్ణంగా బోధపడినట్లూ అమాయకప్రజలనుకోడానికి పన్నిన ఉపాయాలు.

అసలు గాంధిగారి ఆజ్ఞలో అర్థమూ లేదు. ఆ ఆజ్ఞను వీరు జవదాటనూ లేరు.

మనతపేచీ పెట్టదలచి గాంధిగారు హామీలు కావాలన్నారు రాష్ట్రీయకాంగ్రెస్సు నాయకులు. రామచిలకల్లాగ గవర్నర్ల దగ్గిర ఆమాట అప్పగించారు.

అలాగే, గాంధిగారు కాంగ్రెస్సుమంత్రాంగం వున్న రాష్ట్రాలలో పాఠశాలలలో ౧, ౨, ౩ ఫారాల విద్యార్థులకు హిందీని నిర్బంధం చెయ్యా లన్నారు. మన ప్రధానమంత్రిగారు, టెలిఫోను రసీవరులాగ ఆమాటని యిక్కడ వినిపించారు. అంతే.

కాగా, కాంగ్రెస్సు ప్రభుత్వం అయిదేళ్లదాకా వుండడమే తటస్థపడితే, యిక్కడ, మన దేశభాషలన్నీ చచ్చాయన్నమాటే.

ఏమంటే? మనకి యింగ్లీషు తప్పదు. అంటే యెవరూ తప్పించలేరు. నిజానికి, దాని అవసరం కూడా మనకి చాలా యెక్కువగా వుంది. గోఖలేహాలు సభకి అధ్యక్షత వహించిన స్వదేశమిత్రన్ సంపాదకులు సి. ఆర్. శ్రీనివాసన్ గారు "ఇంగ్లీషుభాషని నిరసించి లాభము లేదు. అది అంతర్జాతీయభాషయే కాక ప్రభుత్వభాష కూడాను" అని చెప్పారు. ఇలాగ యింకా చాలాచాలా కారణాలవల్ల ఇంగ్లీషు మనకి తప్పదు.

మనకి మాతృభాష కనక ఆంధ్రమున్నూ తప్పదు.

సంస్కృతం కూడా తప్పదు. తప్పడానికి వీలూ లేదు.

కాంగ్రెస్సు ప్రభుత్వం, హిందీని, పిల్లల నెత్తిమీద పెట్టి రుద్దితీరుతుంది కనక అదిన్నీ తప్పదు.

పాలబుగ్గలవాళ్లు ఇలాగ నాలుగు భాషలు నేర్చుకోవడం తాతాచార్యులుగారి ముద్ర అయినప్పుడు విషయపరిజ్ఞానానికి ఇక వారి అవకాశం యెక్కడ వుంటుందీ?

ఇతిక ర్తవ్యతాజ్ఞానం లేకపోవడంవల్ల, ప్రజలు, యివాళ హిందీని అడ్డుకోవా లని గ్రహించలేకపోయినా, పిల్లల దౌర్భాగ్యస్థితి కళ్లబడ్డ తరవాత అయినా అల్లరి చెయ్యక మానరు.

అప్పుడు బయటపడుతుంది ఘోరమైన కాంగ్రెస్సువారి నిజస్వరూపం.

ఎలాగంటే?

అప్పుడు, వారు, బాలుర విషయపరిజ్ఞానానికి అడ్డు వస్తున్నాయి కనక, యీనాలుగు భాషలలోనూ వొకదాన్ని తగ్గించివేస్తా మంటారు.

తెనుగుపిల్లవాడికి తెనుగు మాతృభాషే కనక, అది సహజంగానే వస్తుంది కనక, దాన్ని పెద్దతరగతులలో నేర్పడం శుష్కదండుగు కనక, తెనుగులో అక్షరజ్ఞానం వుంటే సరిపోతుంది కనక రెండోతరగతినుంచే తెనుగు తీసివేస్తా మంటారు.

ఇంకా కొన్నాళ్లకి "అసలే దౌర్భాగ్యభావ అయిన తెనుగు, సంస్కృతం కంటే మృతభాష అయిపోయింది కనక, అది లేకపోతే జాతీయతకు భంగం రాదు కనక, అది లేకపోతేనే జాతీయత బలిసి సంపూర్ణస్వరాజ్యం సాధ్యం అవుతుంది కనక దాన్ని పూర్తిగా పాఠశాలలలోనుంచి తీసివేశా మంటారు.

ఇతరదేశాల సంగతి యేమయినా, కాంగ్రెస్సు ప్రభుత్వంలో, ఆంధ్రదేశంలో, యిది తప్పకుండా జరుగుతుంది.

ఇది గాంధిగారి దృఢసంకల్పం: వారు, తమ విధేయులను ఇక్కడ యిందుకోసమే ప్రధానమంత్రిగా యేర్పరిచారు.

ఆధునికాంధ్రవాఙ్మయం

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారివి

1 రక్షాబంధనం 1-0-0, 2 శ్మశానవాటిక 0-8-0, 3 వారకాంత 0-4-0, 4 గూడుమారిన కొత్తరికం 0-2-0, 5 విజయనగరరాజుల కథలు 0-2-0, 6 చిత్తూరు రాజులకథలు 0-3-0, 7 ఢిల్లీచక్రవర్తుల కథలు, 0-3-0, 8 గోల్కొండనవాబులకథలు 0-1-0 9 ప్రబుద్ధాంధ్ర అయిదోసంపుటం 2-0-0.

రాయప్రోలు సుబ్బారావుగారివి

1 కవితాంజలి 1-0-0, 2 జడకుచ్చులు 1-0-0

కురుగంటి సీతారామయ్యగారివి

1 తంజావురాంధ్రనాయకరాజులచరిత్ర 2-0-0

వేటూరి ప్రభాకరశాస్త్రిగారివి

1 శృంగార శ్రీనాథం 2-0-0

గోల్కొండ పత్రికవారివి

1 గోల్కొండకవుల సంచిక 2-0-0, 2 ఉచ్ఛలవిషాదం నాటకం 0-12-0, 3 రెడ్డికుల నిర్ణయచంద్రిక 1-4-0, సంఘోద్ధరణము 0-6-0, 5 కర్నూలురాజవంశావళి 0-2-0, 6 రఘునాథ్ 0-1-6.

కవితాసమితివారివి

1 వైశాఖి 1-0-0, 2 ఉత్కలపతనం నాటకం 0-12-0, 3 ప్రభవ 0-8-0, 4 తెనుగుతోటబుట్టువులు 0-8-0, 5 కవిగారి మనుగడ 0-8-0

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారివి

1 వ్యాసావళి 0-4-0

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారివి

1 నాటకోపన్యాసాలు 0-12-0

మొక్కపాటి నరసింహశాస్త్రిగారివి

1 ప్రతిబింబములు 0-12-0, 2 ఏకోదరులు 0-8-0

మునిమాణిక్యం నరసింహారావుగారివి

1 కాంతం కథలు 1-0-0, 2 నేనూ మాకాంతం 0-4-0, 3 వక్రరేఖ 1-0-0, 4 ఉపాధ్యాయుడు 0-8-0

నడింపల్లి జగన్నాధరావుగారివి

1 ఆంధ్రమహాసామ్రాజ్యము 1-4-0

వేదాల తిరువెంగళాచార్యులుగారివి

1 ఆంధ్రకావ్యాలంకారసూత్రవృత్తి 1-4-0

మార్కండేయభవనంవారివి

1 సచ్చిదానం 1-0-0

నరహరిశెట్టి వెంకటరత్నంగారివి

1 ఆంధ్రహృదయం నవల 0-8-0

కలాభివర్ధనీపరిషత్తు రాజమండ్రి.

ఆంధ్ర శేష.గిరిరావుగారివి

1 కేయూరబాహుచరిత్ర వచనం 0-8-0

ఓరుమల్లె అచ్యుతరావుగారివి

1 విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్ర 2-0-0

కళాప్రచారకసమితివారివి

1 శ్రీకృష్ణరాయబారం 1-0-0, 2 సంజయరాయబారం 1-0-0 రెండూకలిసిన బయండు 2-0-0

భమిడిపాటి కామేశ్వరరావుగారివి

1 కాలక్షేపం 0-8-0, 2 అవును 0-8-0, 3 అప్పుడు 0-8-0 4 ఇప్పుడు 0-8-0, 5 నిజం 0-8-0.

నాళం కృష్ణారావుగారివి

1 తేనెటీనుకులు 0-8-0, 2 పాలతరగలు 0-8-0, 3 గోరుముద్దలు 0-4-0, 4 మిాగడతరకలు 0-6-0, 5 వెన్నబుడగలు 0-6-0 6 గోగీతము 0-2-0, 7 పైడిలేడి 0-2-0, 8 ముద్దు 0-4-0.

కలాభివర్ధనీపరిషత్తు రాజమండ్రి

లక్ష్మీకవచము

వలయుకోరికలొసంగుటలో అమోఘము



వలసిన కార్యసాఫల్యమొనగూర్చుటలో అద్భుతము.

పరీక్షయందుత్తీర్ణులు కావలెంచు విద్యార్థులకు ప్రత్యక్షసరస్వతి. ఉద్యోగము లేక అల్లాడువారికి పని కల్పించుటయందును, కోర్టు వ్యాజ్యములలో దగుల్కొని బాధపడువారిని గెల్పొందించుటయందును, దారిద్ర్యసాగరమున క్రుంగి దరిగానక దుఃఖించువారిని సంపన్నులుగా చేయుటలోను కల్పవృక్షము. సంతానము లేక దుఃఖించు దంపతులను సంతానవంతులను చేసి ఆనందపెట్టు చింతామణి. వేయేల? ఇది ఏకోరికతో ధరించిన ఆకోరిక తీర్చు పారిజాతము. ఈకవచము దైవోపాసకులచే బీజాక్షరసంపుటితో లక్ష్మీప్రతిమాసమేతముగ కల్పింపబడినది. దీనిని ధరించి సఫలమనోరథులైనవా రిచ్చిన యోగ్యతాపత్రికలు, దీనిని ధరించునప్పుడు చేయవలసిన పూజావిధానము, లక్ష్మీస్తోత్రము గల పొత్తము కవచముతో పంపబడును.

నోటు:—లక్ష్మీప్రతిమాసమేతమై, బీజాక్షరయుక్తమైన యీ కవచము పంచలోహనిర్మితమై మైలగాలి సోకిన బలము చెడకుండా యుండునట్లు తావేజాగా చుట్టి ధరించుటకు వీలుగా ఉండుటకు కొండీలతోనూ, చక్కని పట్టుత్రాడుతోనూ అమర్చబడియున్నది. వెల 1—4—0 మాత్రమే. డిటో వెండిది 1—12—0.

లక్ష్మీకవచనిలయం, రాజమండ్రి